సాక్షి సిద్దిపేట

సోమవారం, 13 ఫిబ్రవరి, 2023



శనగ దిగుబడి అంతంతే!

యాసంగిలో రైతులు సాగు చేసిన శనగ పంట దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. ఇది రైతులకు ఆందోళనకు గురిచేస్తోంది. 8లో..



కూతురును తీసుకువస్తూ..

హాస్టల్‌లో ఉన్న కూతురును ఇంటికి తీసుకువస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం చెందాడు. 8లో..



లక్ష్యం.. వందశాతం 9లో..

దుబ్బాక మున్సిపల్ పరిధిలో వంద శాతం పన్ను వసూలు లక్ష్యంగా అధికారులు. పాలకవర్గం ముందుకు సాగుతున్నారు.

న్యూస్‌రీల్

15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్



సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులకు ఈ నెల 15 నుంచి మార్చి 2 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సిద్దిపేట జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 66 జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెట్లు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జనరల్ విభాగంలో 5,105 మంది విద్యార్థులు, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 5,892 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని, హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

'అష్టకాల'కు నివాళి



నివాళులు అర్పిస్తున్న జాసాప కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అనంతసాగర్ సరస్వతి క్షేత్ర నిర్మాత అష్టకాల నరసింహారామశర్మ మరణం సాహితీ లోకానికి తీరని లోటని జాతీయ సాహిత్య పరిషత్ కవులు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో నరసింహారామశర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో అవధాన ప్రక్రియలో వేనోళ్ళ కీర్తి గడించిన నరసింహారామశర్మ అందరికీ ఆదర్శమన్నారు. దేశం మొత్తం సరస్వతీ యజ్ఞాలు నిర్వహించి సరస్వతీ ఉపాసకులుగా పేరుగాంచారని కొనియాడారు. సిద్దిపేట సాహిత్యంలో చెరగని ముద్రవేశారని ఆయన మరణం తీరని లోటన్నారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్యం కవులు ఎన్నవెళ్లి రాజమౌళి, ఉండ్రాళ్ళ రాజేశం, బస్వ రాజ్ కుమార్, శ్రీచరణ్ సాయిదాస్, తిరుపతి పాల్గొన్నారు.

టగ్ ఆఫ్ వార్ జిల్లా కమిటీ ఎన్నిక



జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సిద్దిపేటఎడ్యుకేషన్/దుబ్బాకటౌన్: టగ్ ఆఫ్ వార్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ బ్రహ్మానందం అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లాల టగ్ ఆఫ్ వార్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా గన్నె శ్రావణ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా బాణాపురం సుమన, ఉపాధ్యక్షుడిగా ధరావత్ రమేశ్, జాయింట్ సెక్రెటరీగా గన్నె కుమార్, కోశాధికారిగా తీగుల్ల రాజు, సభ్యులు సురేష్, భరత్, అజయ్‌కుమార్, నరేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్రీడ విస్తరణకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా అయూబ్‌ఖాన్ వ్యవహరించగా మాజీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ గన్నె రాజిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు భానుప్రకాశ్, జూడో అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి గన్నె భరత్‌రెడ్డి, పెటా టీస్ అధ్యక్షుడు తోట సతీష్, కోశాధికారి రాము, స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

నియామకం

కొండపాక(గజ్వేల్): తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల జిల్లా పేరెంట్స్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుద్దెడకు చెందిన చిట్యాల నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాములు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వాహకులుగా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట లింగయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ టీఎస్ డబ్ల్యుఆర్ఎస్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగరావు, అంకిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ జాలిగామ నర్సింగరావు, వర్గల్ మాజీ జెడ్పీటీసీ పోశయ్య పాల్గొన్నారు.

సఖ్యత కొరవడే..

- మున్సిపాలిటీలో సమస్యలను పట్టించుకోని ఛైర్మన్, కౌన్సిలర్లు
- కొనసాగుతున్న క్యాంపు రాజకీయాలు



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం

గజ్వేల్: అవిశ్వాస రాజకీయాల నేపథ్యంలో అందరి దృష్టి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీపై కేంద్రీకృతమైంది. సీఎం 'ఇలాకా' కావడంతో జిల్లాలో ఎక్కడ చూసినా అసమ్మతిపై చర్చ జరుగుతోంది. ఛైర్మన్, కౌన్సిలర్ల మధ్య సఖ్యత కొరవడడంతోనే ఈ గందరగోళానికి దారి తీసిందని పలువురు అంటున్నారు. కాగా కౌన్సిలర్ల అసమ్మతి ఘటనతో పట్టణంలో అభివృద్ధి పడకేసింది. ఎక్కడి పనులు అక్కడ నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకవర్గ సభ్యులు త్వరగా ఒక నిర్ణయానికి వచ్చి అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

పనులపై పట్టింపేదీ?

పట్టణంలో రూ.100కోట్లతో యూజీడీ పనులు కొనసాగుతుండగా గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో మాత్రమే పనులు పూర్తి కావొస్తున్నాయి. విలీన గ్రామాలైన మధిర, ముట్రాజ్‌పల్లి, క్యాసారం, రాజిరెడిపల్లి, సంగాపూర్, సంగుపల్లిలో పనుల కోసం నిధులు అవసరం ఉన్నా పట్టించుకోవడం లేదు. ఆయా గ్రామాలకు అవసరమైన రూ.48కోట్ల అదనపు నిధులకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. నాలుగేళ్లు గడుస్తున్నా నిధుల మంజూరు విషయంపై ఛైర్మన్, కౌన్సిలర్లు పట్టించుకోలేదు. యూజీడీ పనుల్లో నాణ్యతలోపం బయటపడినా పట్టించుకోలేదని, కాంట్రాక్టర్‌కు ఉద్దేశపూర్వకంగానే వత్తాసు పలికారని ఆరోపణలు గుప్పుమన్నాయి. కోటమైసమ్మ రోడ్డు విస్తరణపై దృష్టి సారించకపోవడంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. పాండవుల చెరువు, మహతి ఆడిటోరియం పెండింగ్ పనులు, రేడియల్ రోడ్ల విస్తరణను పట్టించుకోకుండా లాభం చేకూర్చే పనుల విషయంలో ఇరు వర్గాలు గొడవలకు దిగుతూ, రాజకీయాలు చేయడంతో అభివృద్ధి పనులు ముందుకుసాగడంలేదని ఆరోపణలున్నాయి.

క్యాంపులోనే కౌన్సిలర్లు..

గజ్వేల్ మున్సిపాలిటీలో 20 మంది సభ్యుల్లో 14 మంది అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. కలెక్టర్‌కు తీర్మానం కాపీ ఇచ్చిన తమకు పైనుంచి ఒత్తిళ్లు తప్పవని భావించిన కౌన్సిలర్లు అదే రోజు క్యాంపునకు తరలివెళ్లిన సంగతి తెలిసిందే. కాగా ఇంత కాలం పాలకవర్గ సభ్యులు కలిసి ఉన్నారే తప్ప పట్టణ సమస్యలపై సమన్వయంతో పని చేయలేదనే విషయం స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో అసమ్మతి సమస్య ముగిసే వరకు మున్సిపల్ పాలన ముందుకు వెళ్లేలా కనబడడంలేదు.

ఎప్పటికి తెరపడేనో?

ఈ నెల 9న కలెక్టర్‌కు అవిశ్వాస పత్రం ఇచ్చే 15 రోజుల ముందు నుంచే ఈ అంశం నానుతూ ఉన్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఛైర్మన్‌కు విషయం తెలిసినా పార్టీ పెద్దలను అప్రమత్తం చేయలేదని, కౌన్సిలర్లతో మాట్లాడలేదనే ఆరోపణలున్నాయి. కలెక్టర్ వద్దకు వెళ్లే ముందు అవిశ్వాసానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఒకరిద్దరు సభ్యులు ఛైర్మన్‌ను కలిసి, ఏం చేయాలో చెప్పాలని అడిగినా పట్టించుకోలేదని, అందుకే విషయం ఇంత దూరం వచ్చిందనే ప్రచారం సాగుతోంది. తన వైఫల్యాలన్ని కప్పిపుచ్చుకునేందుకు నియోజకవర్గంలో పెద్దలు తనకు సహకరించడం లేదంటూ ఛైర్మన్ కొత్త వాదనను తెరపైకి తెచ్చారనే విమర్శ కూడా ఉంది. ఈ అంశంపై ఛైర్మన్ రాజమౌళిని ×సాక్షి₹ వివరణ కోరగా.. అసమ్మతి విషయం ఒక రోజు ముందే సభ్యుల ద్వారా తెలిసిందని, మాట్లాడుకుందామని చెప్పినా వారు వినలేదన్నారు. మొత్తానికి ఇరువర్గాల తీరు పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారడంతో, ఈ గందరగోళానికి తెరదించేందుకు సోమవారం చర్యలు ఉండవచ్చని తెలుస్తోంది.

మల్లన్న క్షేత్రం భక్తజన సంద్రం



గంగిరేణి చెట్టు వద్ద భక్తులు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- మల్లన్న నామస్మరణతో మారుమోగిన ఆలయ పరిసరాలు



క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు



నెత్తిన బోనాలతో మహిళలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న నామస్మరణ, భక్తుల కోలాహలంతో నడుమ కొమురవెల్లి ఆలయ ప్రాంగణం మారుమోగింది. సంక్రాంతి తర్వాత వచ్చే సత్తేటి నాలుగో వారం ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. సుమారు 40 వేల మంది మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రి నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులకు వసతి గదులు సరిపోక ప్రయివేటును ఆశ్రయించారు. ఆదివారం వేకువజామున తలనీలాలు సమర్పించి, స్నానమాచరించి ఒక్క పొద్దులు, మట్టికుండలో పసుపు బియ్యంతో నైవేద్యం సమర్పించారు. గంగిరేణి చెట్టు వద్ద బోనాలు పెట్టి పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మల్లన్న గుట్టపై న రేణుక ఎల్లమ్మకు బోనాలు అర్పించారు. భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈఓ బాలాజీ, ఆలయ ఛైర్మన్ గీస భిక్షపతి, ఏఈఓ అంజయ్య, పర్యవేక్షకులు నీలశేఖర్, శ్రీనివాస శర్మ, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, సిబ్బంది, అర్చకులు భక్తులకు సేవలందించారు. అడిషనల్ డీసీపీ మహేందర్, ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కిటకిటలాడిన ఏడుపాయల



ఆలయం ఎదుట భక్తుల సందడి

పాపన్నపేట(మెదక్): భక్తులతో ఏడుపాయల జన సంద్రంగా మారింది. ఆదివారం ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మంజీరనది పాయల్లో స్నానాలు చేసి, దుర్గమ్మ దర్శనానికి బారులుదీరారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి.. బోనాలు సమర్పించారు. ఆపై మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు కలగకుండా ఆలయ ఛైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాసులు చూశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



కప్పుతో ప్రశాంత్

గజ్వేల్‌రూరల్: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్ బాల్ పోటీలకు మండలంలోని అహ్మదీపూర్‌కు చెందిన ప్రశాంత్ ఎంపికైనట్లు విలేజ్ పీఈటీ నరేశ్ తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఉస్మానియా ఇంటర్ యూనివర్సిటీ స్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నాడు. ఈ నెల 14 నుంచి 17 వరకు కర్ణాటక రాష్ట్రంలో జరిగే ఆల్ ఇండియా నెట్ బాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల ప్రతిభ



బహుమతి సాధించిన బాలికల జట్టు

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ చాంపియన్ షిప్ సబ్ జూనియర్-15 పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన పోటీల్లో బాలికల జట్టులో గాయత్రి, రాధిక, మనీషా, అక్షయ, శ్రీలక్ష్మి, శ్రీనిధి, మధులిక, నిఖిత, శృతిలో పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ శ్రీనివాస్ రావు చేతుల మీదుగా ఆదివారం బహుమతులు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన బాలికల జట్టును ఉమ్మడి జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జిల్లా కార్యదర్శి పీవీ రమణ అభినందించారు.

360 టన్నుల ఇసుకతో శివలింగ దర్శనం



మాట్లాడుతున్న మహేశ్వర శర్మ సిద్ధాంతి

సంగారెడ్డి టౌన్: మండలంలోని ఫసల్వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో మహా శివరాత్రికి 360 టన్నుల ఇసుకతో శివలింగ దర్శనం కల్పిస్తున్నట్లు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. ఆదివారం ఆశ్రమంలో విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 18వ తేదీన 19.5 అడుగుల సైకత లింగ మహోత్సవ కార్యక్రమం ఉంటుందని, 15వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు సైకతలింగ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు. 360 టన్నుల ఇసుకతో ఈ లింగాన్ని తయారు చేసినట్లు చెప్పారు. 18వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 19వ తేదీ ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు భక్తులు స్వయంగా అభిషేకం చేసుకొనే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు ప్రశాంత్‌కుమార్, సంజయ్ కుమార్, కృష్ణమూర్తి, రాజేంద్ర, కాశీనాథ్ పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్బిటరీ ఇన్‌చార్జ్ శాంతయ్య ప్రార్థనలు చేసి భక్తులను ఆశీర్వదించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

చర్చి చుట్టూ శిలువను ఊరేగిస్తున్న భక్తులు



పేదలకు అండగా బీజేపీ



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పేదలకు అండగా బీజేపీ ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత మల్లేశం అన్నారు. మండలంలోని ఓబులాపూర్, చర్లఅంకిరెడ్డిపల్లి, రామునిపట్ల గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రజా సంక్షేమం కోసం పని చేస్తుంటే, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలను నేరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ అసమర్థ పాలనతో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోతోందని, అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిట్ల పర్శరాములు, అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్ రావు, నాయకులు విద్యాసాగర్, భూమేష్ గౌడ్, తిరుపతిరావ్, ముచ్చర్ల నాగరాజు, అక్కి సంతోష్, నిమ్మల శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మారథాన్ జోష్

భారీగా తరలివచ్చిన యువత

- ఉత్సాహంగా సాగిన పోటీలు
- హాజరైన సీపీ, ఎమ్మెల్యే



పోటీలకు హాజరైన యువత

హుస్నాబాద్: గెలుపు, ఓటములను లెక్కచేయకుండా ప్రతీ ఒక్కరు పోటీల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సీపీ శ్వేత అన్నారు. హుస్నాబాద్ పోలీస్ శాఖ, హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏన వద్ద ఆదివారం నిర్వహించిన హాఫ్ మారథాన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సిద్దిపేట సీపీ శ్వేత హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోటీలకు తెలంగాణతో పాటుగా ఏపీ, కేరళకు చెందిన యువత భారీగా తరలివచ్చారు. 21కె రన్‌లో సిద్దిపేట సీపీ శ్వేత, 10కె రన్‌లో ఎమ్మెల్యే సతీమణి ప్రొఫెసర్ షమిత పాల్గొని టార్గెట్‌ను పూర్తి చేశారు. హైదరాబాద్‌కు చెందిన 71 ఏళ్ల వృద్ధుడు నాగభూషణ్ రావు 21కె హాఫ్ మారథాన్ పూర్తి చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది సంపూర్ణ ఆరోగ్యం కోసం హాఫ్ మారథాన్ పోటీలు నిర్వహిస్తామని, ఈవెంట్స్‌తో శారీరక దారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. సీపీ శ్వేత మట్లాడుతూ ఆరోగ్యం కోసం ప్రతీ రోజు రన్నింగ్, క్రీడలు ఆడితే డాక్టర్ అవసరం ఉండదన్నారు.



మారథాన్‌లో పరుగు తీస్తున్న సీపీ శ్వేత

విజేతలు వీరే...

- 21కె రన్నింగ్‌లో పురుషుల విభాగంలో నాగర్ కర్నూల్‌కు చెందిన రమేష్ చంద్ర (ప్రథమ), నల్లగొండకు చెందిన బి.రమేష్ (ద్వితీయ), రాజమండ్రికి చెందిన వేదవ్యాస్ (తృతీయ) ప్రతిభ చూపారు. మహిళా విభాగంలో నల్గొండకు చెందిన నవ్య (ప్రథమ), హైదరాబాద్‌కు చెందిన మహేశ్వరి (ద్వితీయ), ఖమ్మంకు చెందిన కామాక్షి (తృతీయ) స్థానం సాధించారు.
- 10కె రన్‌లో వరంగల్‌కు చెందిన లింగన్న (ప్రథమ), రాథోడ్ అనిల్ (ద్వితీయ), కామారెడ్డికి చెందిన కాట్రోతు అనిల్(తృతీయ), మహిళా విభాగంలో నల్గొండకు చెందిన ఉమ (ప్రథమ), కరీంనగర్‌కు చెందిన సమీరా భేగం(ద్వితీయ), భద్రాచలంకు చెందిన కుమారి(తృతీయ) ప్రతిభ చూపారు.
- 5 కె రన్‌లో పురుషుల విభాగంలో రఫీ(ప్రథమ), అభిషేక్(ద్వితీయ), అనీ(తృతీయ), మహిళా విభాగంలో హైదరాబాద్‌కు చెందిన విశాలక్ష్మి(ప్రథమ), నల్గొండకు చెందిన కళ్యాణి (ద్వితీయ), కామారెడ్డికి చెందిన హరిత (తృతీయ) స్థానంలో నిలిచారు. వీరందరికి నగదు పురస్కారంతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, జెడ్పీ వైస్‌ఛైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఏసీపీ సతీశ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత, జెడ్పీటీసీ భూక్య మంగ, సీఐ ఎర్రల కిరణ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రఘుపతి రెడ్డి, ఎస్ఐలు మహేష్, వివేక్, నరేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న యువత



విజేతలతో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సీపీ శ్వేత

క్లుప్తంగా

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



ఎంపీకి ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఈఓ

హుస్నాబాద్‌రూరల్: ఈ నెల 17 నుంచి పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి సన్నిధిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు రావాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు ఆదివారం ఈఓ విశ్వనాథశర్మ ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా వారు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వీరి వెంట కర్ర రవీందర్ రెడ్డి, శ్రీనివాస్‌లు ఉన్నారు.

శ్రీ సిద్ధివినాయక ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాస్

న్యాల్‌కల్(జహీరాబాద్): రేజింతల్ గ్రామ శివారులో శ్రీ సిద్ధివినాయక ఆలయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. ఆయన వెంట టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం, ట్రెజరర్ కృష్ణ రేజింతల్ సర్పంచ్ కుత్బోద్దీన్ తదితరులు ఉన్నారు.

గాయపడిన జింకను ..



జింకకు నీటిని తాగిస్తున్న శ్రీశైలం

జోగిపేట(అందోల్): అందోల్ మండలం పరిధి దానంపల్లి శివారులో గాయపడిన జింక శ్రీశైలంకు కనిపించింది. అతడు పొలం పనుల నిమిత్తం వెళ్తుండగా జింక పడి ఉండటానికి గమనించాడు. దగ్గరకు వెళ్లి చూడగా జింక కాలుకు గాయమైనట్లు గమనించి వెంటనే రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు వచ్చి జింకను తీసుకువెళ్లారు. జింకను కాపాడినందుకు శ్రీశైలంను అభినందించారు.

మెట్లపై నుంచి జారిపడ్డ వృద్ధుడు..

దుబ్బాకరూరల్: మెట్ల పైనుంచి వృద్ధుడు జారిపడి మృతి చెందాడు. ఈ సంఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్‌లో జరిగింది. ఏఎస్ఐ భిక్యానాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెంటి రాజలింగం(65) ఈనెల 9వ తేదీన డబుల్ బెడ్ రూం మొదటి అంతస్తు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం మృతుడి కుమారుడు నవీన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

శనగ దిగుబడి అంతంతే!

- నవంబర్ వరకు వర్షాలు పడటంతో సాగు ఆలస్యం
- 26వేల ఎకరాల్లో పంట సాగు
- అనుకూలించని వాతావరణం
- పెట్టుబడులతోనే సరి
- కౌలు రైతుల పరిస్థితి అయోమయం
- మార్కెట్‌లోనూ ధర అంతంత మాత్రంగానే



సాగు ఆలస్యం చేయడంతో అంతంత మాత్రంగానే ఎదిగిన శనగ పంట

జహీరాబాద్: రైతులు యాసంగిలో సాగు చేసిన శనగ పంట దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. ఇది రైతులకు ఆందోళనకు గురిచేస్తోంది. ఏటా రైతులు యాసంగిలో తేమ ఆధారంగా పండే శనగ సాగు చేస్తారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రెట్టింపు సాగయ్యింది.

- గత సంవత్సరం సంగారెడ్డి జిల్లాలో 16,400 ఎకరాల్లో శనగ పంట సాగయ్యింది. ఇందులో 70 శాతం మేర జహీరాబాద్ డివిజన్ పరిధిలోనే సాగు చేశారు.
- ఈ ఏడాది ఇది 26వేల ఎకరాలకు పెరిగింది. సాధారణంగా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల మేర పంట దిగుబడులు వస్తాయి. ఈ ఏడాది మాత్రం 3 నుంచి 5 క్వింటాళ్ల మేర మాత్రమే దిగుబడులు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.
- ఎకరా పంట సాగు కోసం రూ.10 వేలు పెట్టుబడులు పెట్టామన్నారు. పంట రాశులు చేసేందుకు గాను మరో రూ.5 వేల మేర ఖర్చవుతాయన్నారు.
- ఇంత మేర పెట్టుబడులు పెట్టినా పంట దిగుబడులు పడిపోతుండటంతో వ్యవసాయం చేయాలన్నా కష్టంగా అనిపిస్తోందని రైతులు వాపోతున్నారు.
- ప్రభుత్వం శనగ పంటకు గిట్టుబాటు ధర చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు. క్వింటాల్‌కు కనీసం రూ.8 వేలు ఉంటేనే గిట్టుబాటవుతుందంటున్నారు.
- పెట్టుబడుల వ్యయం పెరుగుతున్నా గత దశాబ్ద కాలంగా శనగ పంట ధర మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం

- శనగ పంట సాగు ఆలస్యం కావడం కూడా పంట దిగుబడులపై ప్రభావం చూపిందన్నారు.
- నవంబర్ వరకు వర్షాలు పడకపోవటంతో సకాలంలో విత్తనాలు వేసుకోలేక పోయామంటున్నారు.
- అక్టోబర్‌లో విత్తనాలు వేసుకున్నట్లయితే పంట దిగుబడులు పెరిగేవన్నారు.
- పంటకు వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించక పోవడం కూడా దిగుబడులపై ప్రభావం చూపిందన్నారు.
- తెగుళ్లు సోకడం, పచ్చ పురుగు ఉధృతంగా రావడం కూడా కారణమంటున్నారు.

ఆశించిన మేర రాక..

- ఆశించిన మేర పంట దిగుబడులు రాక పోవడం కౌలు రైతులను కలవరానికి గురి చేస్తోంది. పంట ఉత్పత్తులు పెట్టుబడులకే సరిపోతున్నాయని, కౌలు డబ్బులు చేతి నుంచి చెల్లించాల్సిన పరిస్థితి ఎదురైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఎకరాకు రూ.12 నుంచి రూ.15 వేల మేర చెల్లించి కౌలుకు తీసుకున్నట్లు కౌలు రైతులు చెబుతున్నారు. ఇంత మేర కౌలును వడ్డీకి తెచ్చి చెల్లించిన్నట్లు పలువురు తెలిపారు.

ధర గిట్టుబాటు కాక..

- మార్కెట్లో శనగ పంటకు ధర అంతంత మాత్రంగానే పలుకుతోంది. మార్కెట్‌లో క్వింటాల్ శనగల ధర కేవలం రూ.4,100 నుంచి రూ.4,600 మాత్రమే ధర పలుకుతోంది.
- ఈ ధర తమకు ఎంత మాత్రం గిట్టుబాటుగా లేదని రైతులు పేర్కొంటున్నారు.
- పెట్టుబడులను పరిగణనలోకి తీసుకొని కనీసం రూ.8 వేలు ధర చెల్లించేలా చూడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దిగుబడి రావడం లేదు



శనగ పంట దిగుబడులు ఏ మాత్రం ఆశాజనకంగా లేవు. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల మేర వస్తున్నాయి. నేను పది ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. ఇందులో 5 ఎకరాల్లో శనగ పంట సాగు చేశా. వర్షాకాలంలో పెట్టిన పంటలు అధిక వర్షాల వల్ల చేతికందకుండా పోయాయి. కనీసం యాసంగిలో అయినా శనగ పంట ఆశాజనకంగా ఉంటుందని భావించా. పంట అంతంత మాత్రంగానే ఉండటంతో పెట్టుబడులకే సరిపోనుంది. కౌలు డబ్బు మొత్తం చేతి నుంచే కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– కె.శ్రీకాంత్‌రెడ్డి, రైతు, కోహీర్

పూత సమయంలో..



రైతులు శనగ పంట సాగును ఆలస్యంగా చేయడం వల్లే పంట దిగుబడులపై ప్రభావం చూపుతోంది. పూత వచ్చే సమయంలో తగిన వాతావరణం ఉంటేనే నిలిచి దిగుబడులు వస్తాయి. ఆలస్యంగా విత్తనాలు వేయడం వల్ల పూత సమయంలో పూత దెబ్బతిని దిగుబడులు పడిపోతున్నాయి. సకాలంలో పంటను వేసుకోవాలని రైతులకు సూచించినా కొంత ఆలస్యంగా వేసుకున్నారు.

– వినోద్‌కుమార్, ఏఓ–మొగుడంపల్లి

ఇద్దరి ఆత్మహత్య



శ్రావణ్ కుమార్ మృతదేహం

నర్సాపూర్ రూరల్: జులాయిగా తిరుగుతున్న కొడుకుని తల్లి మందలించడంతో మనస్తాపంతో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సాపూర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని చైత్యనపూరి కాలనీకి చెందిన కర్లచు శ్రావణ్ కుమార్ (26) పని చేయకుండా జులాయిగా తిరుగుతూ తాగుడుకు బానిసయ్యాడు. మద్యం తాగడం మానేసి పనిచేసుకోవాలని తల్లి వెంకట లక్ష్మీ గట్టిగా మందలించడంతో మనస్తాపంతో ఉరివేసుకొన్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



యాదగిరి (ఫైల్)

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో జరిగింది. ఆదివారం బేగంపేట ఎస్ఐ అరుణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎల్కల్‌కు చెందిన తౌర్రి యాదగిరి(38) వ్యవసాయం చేస్తున్నాడు. పెద్ద కుమార్తె వివాహం కోసం అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం కనబడక పోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. శనివారం పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య రజిత, కుమారుడు కుటుంబ పొలానికి వెళ్లి వెతికగా యాదగిరి చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పంచనామ నిర్వహించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

టీపీసీసీ కార్యదర్శి చంద్రం



జెండా ఎగురవేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తామని టీపీసీసీ కార్యదర్శి దరిపల్లి చంద్రం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రామునిపట్లలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమం చేపట్టారు. పార్టీ జెండా ఆవిష్కరించి, ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తూ పాలన సాగిస్తుందన్నారు. వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తామని ప్రచారం చేయడం తప్పా ఆచరణ శూన్యమన్నారు. మాయ మాటలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసగిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మిట్టపల్లి గణేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు యాదగిరి, కలీమొద్దీన్, అజ్జుయాదవ్, సతీష్, రామచంద్రం, ఎల్లయ్య, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రుతుప్రేమపై మరింత చైతన్యం

మున్సిపల్ చైర్మన్ మంజుల



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మంజుల

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్రానికి వినూత్నంగా చెప్పుకునే రుతుప్రేమపై మరింత చైతన్యం, అవగాహన అవసరమని బల్దియా చైర్మన్ మంజుల రాజనర్స్ అన్నారు. ఆదివారం 24వ వార్డులో రుతుప్రేమ చైతన్య రథం వద్ద మహిళలకు రుతుప్రేమపై అవగాహన కల్పించారు. మహిళల నెలసరి సమయంలో ఇబ్బందులు, ఆరోగ్య సమాజం కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రతీరోజు పట్టణంలో ఇంటింటికి చెత్త సేకరణ సమయంలో తడి, పొడి చెత్త సేకరణ, అదేవిధంగా రుతుప్రేమపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీరోజు ఒక వార్డు చొప్పున పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో చైతన్య రథం తిరుగుతుందన్నారు. శానిటరీ ప్యాడ్స్ వినియోగ రహిత పట్టణంగా సిద్దిపేటను మార్చేందుకు ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మహిళల ఆరోగ్యం గురించి ఆలోచించి చేపట్టిన కార్యక్రమంపై మంత్రి హరీశ్‌రావుకు పట్టణ మహిళల పక్షాన కతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం క్లాత్ ప్యాడ్స్, మేల్ కప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

సిద్దిపేట జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ ఆంజనేయులు



బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆత్మరక్షణ కోసం కరాటే ఉపయోగపడుతుందని సిద్దిపేట జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ ఆంజనేయులు అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్, సిద్దిపేట జిల్లా కరాటే అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రం భారత్‌నగర్ శ్రీవాణి టెక్నో స్కూల్‌లో కరాటే బెల్ట్ పోటీలు నిర్వహించారు. కరాటే బెల్ట్ గ్రేడింగ్ న్యాయ నిర్ణేతగా సిద్దిపేట జిల్లా చీఫ్ రాచకొండ ఆంజనేయులు వ్యవహరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. కరాటే నేర్చుకుంటే ఇమ్యూనిటీ పవర్, బాడీ ఫ్లెక్సిబుల్, శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతోగానో దోహదపడుతుందన్నారు. కరాటే విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బెల్ట్‌లు, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీవాణి టెక్నో స్కూల్ కరెస్పాండెంట్ సీహెచ్ సత్యం, కరాటే మాస్టర్ భాగ్యరాజ్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు



రైల్వే అండర్ బ్రిడ్జి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ నగర్ నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే మార్గంలో రైల్వే అండర్ బ్రిడ్జి కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. రాత్రి వేళలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కొత్త కాలనీలు రూపుదిద్దుకోవడంతో ట్రాఫిక్ రద్దీ మరింత పెరుగుతోంది. ప్రధానంగా రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందర వందరగా పడేసిన వస్తువులు

జహీరాబాద్: పట్టణంలోని ఎన్జీఓ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమాని మాణిక్యప్ప కుటుంబం ఊరికి వెళ్లారు. దీంతో దొంగలు శనివారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో దాచిన పది తులాల బంగారం, రూ.30వేల నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన యజమాని ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో ఉలిక్కి పడ్డాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జహీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం(పటాన్ చెరు): ఆలయ అభివృద్ధికి రూ.20లక్షలు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విరాళంగా అందించారు. గుమ్మడిదలలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న మండల స్థాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన భవన నిర్మాణానికి రూ.20 లక్షలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కుల సంఘాల ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు తన వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా తాను, తమ ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ కార్యకర్తలు 24 గంటలు అందుబాటులో ఉంటామన్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, బ్రాహ్మణ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జీఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్ గౌడ్, సర్పంచ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ..

అనుమానాస్పద స్థితిలో మృతి



హత్య నాయక్ మృతదేహం

నర్సాపూర్ రూరల్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన నర్సాపూర్ మండలం లింగాపూర్ పంచాయతీ పరిధిలోని జగ్య తండాలో ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. నర్సాపూర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగ్య తండాకు చెందిన నునావత్ హత్య నాయక్ (56) ఆదివారం వేకువజామున తండా సమీపంలో ఉన్న అయ్యారోని కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టుకొని తిరిగి వస్తుండగా అదే తండాకు చెందిన వరుసకు తమ్ముడు రవి బోరు బావి వద్ద అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించాడు. మృతుడి భార్య కమిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేపట్టారు.

బురదలోపడి రైతు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దుబ్బాక: పొద్దు తిరుగుడు పంటకు నీరు పెడుతుండగా ప్రమాదవశాత్తు బురదలో పడి రైతు మృతి చెందాడు. ఈ ఘటన రాయపోల్ మండలం తిమ్మక్కపల్లి గ్రామాలంలో జరిగింది. ఆదివారం రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన పొట్టెల్ల కనకయ్య(33) వ్యవసాయం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మరొక రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని పొద్దుతిరుగుడు పంటను సాగు చేస్తున్నాడు. శనివారం పొలానికి నీరు పెట్టడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. దీంతో భార్య నవనీత స్థానికులతో కలిసి పొలానికి వెళ్లి చూడగా కనకయ్య పొలంలో విగత జీవిలాపడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. శుభకార్యానికి వెళ్లి తిరిగివస్తూ బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. అలాగే తండ్రీ, కూతురు వస్తున్న బైక్‌ను డీసీఎం ఢీకొనడంతో తండ్రి మరణించగా, కూతురు గాయపడింది. మరోచోట సైకిల్‌ను బైక్ ఢీకొనడంతో వృద్ధుడు మరణించాడు.

శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తూ ..



మామిండ్ల రాజు (ఫైల్)

వర్గల్(గజ్వేల్): శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తూ రోడ్డు ప్రమాదానికి గురై యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి వర్గల్ మండలం మాదారం వద్ద చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లికి చెందిన మామిండ్ల రాజు(28)కు భార్య లక్ష్మి, రెండేళ్లలోపు అభిలాష్, మనీష్ పిల్లలు ఉన్నారు. వ్యవసాయంతోపాటు మేస్త్రీ పనిచేస్తుంటాడు. ఆదివారం ములుగు మండలం క్షీరసాగర్‌లోని బంధువుల శుభకార్యానికి రాజు వెళ్లాడు. సాయంత్రం గ్రామానికి తిరిగొస్తుండగా మాదారం వద్ద బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కొడుకు బర్త్‌డే వేడుక మరవక ముందే..

శుక్రవారం మామిండ్ల రాజు దంపతులు తమ చిన్న కుమారుడు మనీష్ మొదటి బర్త్‌డే సంబరంగా జరుపుకున్నారు. ఆ వేడుక మరిచిపోకముందే ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో భార్య, కుటుంబీకులు రోదిస్తున్నారు.

సైకిల్‌ను ఢీకొట్టిన బైక్..



బుచ్చయ్య మృతదేహం

మిరుదొడ్డి(దుబ్బాక): సైకిల్‌ను బైక్ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు తలారి బుచ్చయ్య (59) తన పొలం నుంచి రాత్రి సైకిల్‌పై ఇంటికి బయలు దేరాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వస్తూ సైకిల్‌ను ఎదురుగా ఢీ కొట్టాడు. దీంతో బుచ్చయ్య కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తున్న వ్యక్తికీ గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే 108కు సమాచారం అందించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న 108 వైద్య సిబ్బంది పరీక్షించగా అప్పటికే బుచ్చయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భూంపల్లి కేసు నమోదు చేసుకుని బుచ్చయ్య మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కూతురును హాస్టల్ నుంచి తీసుకొస్తూ ..



గంగాధర్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): డీసీఎం ఢీకొట్టడంతో తండ్రి మృతి చెందగా, కూతురు తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన చేగుంట శివారు జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంటకు చెందిన చిన్నచేవ గంగాధర్(46) కూతురు రవళి మండలంలోని రెడ్డిపల్లి కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ చదువుతోంది. కూతురును తీసుకురావడానికి పల్సర్ బైక్‌పై వెళ్లాడు. కూతురును తీసుకొని చేగుంటకు వస్తుండగా బాలాజీ ధర్మకాంట వద్ద యూటర్న్ తీసుకుంటున్న బైక్‌ను హైదరాబాద్ నుంచి వేగంగా వస్తున్న డీసీఎం వ్యాను ఢీకొట్టింది. దీంతో గంగాధర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రవళికి తీవ్రగాయాలయ్యాయి. గంగాధర్ తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. చికిత్స కోసం రవళిని హైదరాబాద్‌కు తరలించినట్లు చెప్పారు.